క్లుప్తంగా

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

సదుం: వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోకుండా ప్రజలు, రైతులు అప్రమత్తంగా ట్రాన్స్‌కో ఏఈ ఖాదర్ ఇలాహీ కోరారు. తడిసిన చేతులతో విద్యుత్ స్తంభాలు, మోటరు స్టార్టర్లను, విద్యుత్ లైన్లను తాకుతున్న చెట్లను తాకరాదని, అలాంటి చెట్ల వివరాలు తమ దృష్టికి తేవాలని కోరారు. గాలి వలన తెగిన వైర్లను సైతం ఎట్టి పరిస్థితుల్లో తాకరాదన్నారు. విద్యుత్ తీగలకు సమీపంలో దుస్తులు ఆరవేయరాదన్నారు. చిన్నారులు ఎలక్ట్రిక్ వస్తువుల వద్దకు వెళ్లకుండా చూడాలన్నారు.

సంప్రదాయబద్ధంగా చవితి వేడుకలు నిర్వహిద్దాం



హాజరైన ఉత్సవ కమిటీ సభ్యులు

వి.కోట: సంప్రదాయబద్ధంగా మండలంలో వినాయక చవితి వేడుకలు నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రుడు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక వేణుగోపాలస్వామి ఆవరణలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ, భారతీయ సంస్కృతికి అద్దం పట్టేలా వేడుకలు నిర్వహించాలని సూచించారు. మండపాలు ఏర్పాటు చేయదలచిన వారు ఆన్‌లైన్‌లో అనుమతి ఎలా పొందాలో వివరించారు. కార్యక్రమంలో ఆలయాల ధర్మకర్తలు, చవితి కమిటీ సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

బైరెడ్డిపల్లి: స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం మహతి ఫౌండేషన్ సహకారంతో కుప్పం పీఈఎస్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 45 మందికి వైద్య పరీక్షలు చేసి ఐదుగురిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కుప్పం పీఈఎస్ వైద్యాధికారులు చరణ్, లిఖిత, ఫౌండేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో సత్తా చాటారు



ఒంగోలులో జరిగిన కరాటే పోటీల్లో పతకాలు సాధించిన పుంగనూరు విద్యార్థులు

పుంగనూరు: పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులు కరాటే పోటీలో పతకాలు సాధించినట్లు కరాటే మాస్టర్ మన్సూర్‌బాషా ఆదివారం తెలిపారు. శనివారం ఒంగోలులో సిద్ధార్థ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్రాష్ట్ర కరాటే పోటీలలోపట్టణానికి చెందిన 10 మంది విద్యార్థులు పాల్గొన్నారని, వీరిలో ఎనిమిది మంది వివిధ కేటగిరీలలో బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించినట్లు చెప్పారు. పతకాలు సాధించిన వారిలో ముస్తాక్, మహేష్, సాయి యోగేంద్ర, ఫరూఖాన్, ముస్తఫా, అనీష్, ఆదిల్, షానూర్ ఉన్నట్టు చెప్పారు. వీరికి మాస్టర్లు ఉమర్, ఫరుక్, శిక్షణ ఇచ్చారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

బాలకృష్ణ జన్మదిన వేడుకలు

పుంగనూరు: సినీ నటుడు నందమూరి బాలకృష్ణ జన్మదినం పురస్కరించుకుని ఆదివారం స్థానిక గోకుల్ సర్కిల్‌లో తెలుగుదేశం నాయకులు, బాలకృష్ణ అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఆర్‌ఎంపి వైద్యుడు అప్పిరెడ్డి మాట్లాడుతూ రెండు రూపాయలకే వైద్యసేవలు అందిస్తామని తెలిపారు. అనంతరం అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు సివి.రెడ్డి, గిరి, మాధవరెడ్డి, శ్రీకాంత్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈరోజు

రాజన్న వర్ధంతి

పుంగనూరు: మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం బస్టాండ్ వద్ద రాజన్న విగ్రహం వద్ద నివాళి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సీమ జిల్లాల మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఫక్రుద్దీన్ షరీఫ్ తెలిపారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద సోమవారం ఉదయం 9 గంటలకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖరరెడ్డి వర్ధంతి నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాగా రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు, పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

రక్తదాన శిబిరం

పుంగనూరు: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం పురస్కరించుకుని సోమవారం రక్తదాన శిబిరం, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆదివారం జనసేన ఇన్‌చార్జ్ చిన్నరాయల్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో 'సామూహిక సౌందర్యలహరి'



పారాయణం చేస్తున్న మహిళలు



ప్రత్యేక అలంకరణలో వైష్ణవీదేవి

చౌడేపల్లె: మండలంలో పుదిపట్లలోని స్వయంభు వైష్ణవీదేవి ఆలయంలో సామూహిక సౌందర్యలహరి పారాయణం నిర్వహించారు. ఆదివారం ఆలయ ప్రధాన అర్చకురాలు శ్రావణి ఆధ్వర్యంలో వైష్ణవిదేవికి విశేష అలంకరణ చేశారు.హైదరాబాద్‌కు చెందిన సౌందర్యలహరి పారాయణ పండితురాలు లక్ష్మీ నరస్వతి ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారి పారాయణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవతామూర్తులను స్మరిస్తూ శ్రీ చక్ర ఆకారాన్ని రూపొందించారు. దాని గురించి భక్తులకు వివరిస్తూ పారాయణం చేశారు. అలాగే అమ్మవారి ఆలయంలోని కాలభైరవుల విగ్రహాలకు పూజలు చేశారు. ఆలయ నిర్మాణ కర్త వినోద్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బినామీ స్టూడెంట్స్‌తో సీట్ అలాట్‌మెంట్లపై విచారణ

- విచారణకు ఏపీ ఉన్నత విద్యామండలి కమిషనర్ ఆదేశం
- పలమనేరులో వెలుగు చూసిన సీట్ల మార్పిడి ఘరానా మోసం

సాక్షి ఎఫెక్ట్..

పలమనేరు: బినామీ విద్యార్థులతో తమ కళాశాలకు సీట్లను అలాట్‌మెంట్ చేసుకున్న ప్రైవేటు కళాశాలలపై విజయవాడలోని ఏపీ ఉన్నత విద్యామండలి కార్యదర్శి విచారణకు ఆదేశించినట్టు కడప ఆర్‌జేడీ డాక్టర్ బాబు ఆదివారం తెలిపారు. ఇంటర్ పూర్తయిన విద్యార్థులు డిగ్రీలో చేరేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా వెబ్ ఆప్షన్ల ప్రక్రియతో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో డిగ్రీ కోర్సులో సీట్లను కేటాయింపుల్లో అక్రమాలు జరిగిన విషయం తెలిసిందే. దీనిపై సాక్షి దినపత్రికలో 'సీట్ అలాంట్‌మెంటే మార్చేశారు' శీర్షికతో వెలువడిన కథనంపై ఆర్‌జేడీ స్పందించారు. వెబ్ కౌన్సెలింగ్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తెలియకుండా కళాశాలల మార్పుపై సర్వత్రా విమర్శలు వచ్చిన నేపథ్యంలో దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేయనున్నట్టు ఆర్‌జేడీ బాబు తెలిపారు. ఇలాగే, ఉమ్మడి జిల్లాలోని పలుచోట్ల జరిగినట్టు తెలిసింది. ఇప్పుడిప్పుడే విద్యార్థులు జరిగిన మోసంపై ఫిర్యాదు చేసేందుకు ముందుకువస్తున్నారు.

గరుడోత్సవం

పలమనేరు: స్థానిక పాతపేటలో సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి గరుడోత్సవం వైభవంగా నిర్వహించారు. స్థానిక గాండ్ల సంక్షేమ సేవాసంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు స్వామి వారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.



3 నుంచి 'పొలం పిలుస్తోంది'

పుంగనూరు: ఈ నెల 3వ తేదీ నుంచి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏవో టెక్నికల్ ఫయాజ్‌బాషా ఆదివారం తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు పొలాల వద్దకే అధికారులు వెళ్లి రైతులకు వ్యవసాయపరంగా మెలకువలు చెప్పడంతోపాటు పంటల సాగు విషయంలో సలహాలు–సూచనలు ఇస్తారన్నారు. ఇదలా ఉంచితే ప్రతి మంగళ, బుధవారాలలో గ్రామ పరిధిలోని రైతు సేవా కేంద్రం అధికారులు, వ్యవసాయ అనుబంధ శాఖలతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: మండలంలో ఈనెల 3 నుంచి పొలం పిలుస్తోంది గ్రామసభలు నిర్వహించనున్నటుట వ్యవసాయాధికారిణి గీతాకుమారి తెలిపారు. రైతులకు ఉపయోగపడే పథకాలు, సాంకేతిక అంశాలను తెలియజేస్తామన్నారు.

ఆగని గజ దాడులు



ఏనుగులు ధ్వంసం చేసిన వరి పంట

పెద్దపంజాణి: మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. పెద్దకాప్పల్లె పంచాయతీ అటవీ సరిహద్దు గ్రామాలైన ఆకులవారిపల్లె, గౌరీనగర్, ముదిరెడ్డిపల్లె, జిట్టంవారిపల్లి, పెనుగొలకల, పెద్దకాప్పల్లె, తిప్పిరెడ్డిపల్లె, కొత్తబూరగపల్లె రైతులకు చెందిన పంటలను నాశనం చేస్తున్నాయి. శనివారం రాత్రి పలమనేరు ఫారెస్టు రేంజ్ కీలపట్ల బీటు నుంచి వచ్చిన ఏనుగులు పెనుగొలకల గ్రామ సమీపంలోని పంటలపై విధ్వంసం సృష్టించాయి. బాలయ్య, సురేంద్ర తదితరుల వరి పంటను ధ్వంసం చేశాయి. అలాగే తిప్పిరెడ్డిపల్లిపల్లెకు చెందిన మార్కొండా రెడ్డి, నారాయణరెడ్డి, అమరారెడ్డి తదితరుల వరి నారుమడి, వేరుశనగ పంటలను తొక్కి నాశనం చేశాయి. అరటి, కొబ్బరి చెట్లను విరిచేశాయి. ఆదివారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటనష్టాన్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. దాడుల్లో సుమారు రూ 50 వేల మేరకు పంట నష్టం జరిగినట్లు అంచనా. సమాచారం అందుకున్న రాయలపేట ఫారెస్టు బీట్ ఆఫీసర్ రవికుమార్ పంట నష్టాన్ని పరిశీలించారు. వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. ట్రాకర్ల సాయంతో ఏనుగులను అడవిలోకి మళ్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

మట్టి విగ్రహాలతోనే పర్యావరణ పరిరక్షణ



మట్టి విగ్రహాలు

పలమనేరు: రానున్న వినాయకచవితి పండుగ పురస్కరించుకుని అందరూ పూజలకు మట్టి వినాయకుని విగ్రహాలను వినియోగించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్తలు పిలుపునిచ్చారు. ఇప్పటికే మట్టి విగ్రహాలను తయారుచేసిన టెర్రకోట హస్త కళాకారులు వీటిని తక్కువ ధరకే విక్రయిస్తున్నారని తెలిపారు. అలాగే, మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.

వచ్చే నెల 3 నుంచి దసరా ఉత్సవాలు



దుర్గమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న నిర్వాహకులు

పలమనేరు: స్థానిక పాతపేట ఎస్టీ కాలనీలోని కనకదుర్గ ఆలయంలో అక్టోబర్ 3వ తేదీ నుంచి పదిరోజుల పాటు దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. ఆదివారం ఆలయంలో నిర్వాహకులు ప్రత్యేక పూజలను చేశారు. ఉత్సవాల నిర్వహణ విషయమై సమావేశమై చర్చించారు. కార్యక్రమంలో రమణ, ప్రకాష్, రత్నమ్మ, వెంకటేశు, యువరాజ్, ధనలక్ష్మి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెరుమాళ్లపల్లెలో శ్రీకృష్ణుడి ఊరేగింపు



పెరుమాళ్లపల్లెలో శ్రీకృష్ణుడి ఉత్సవమూర్తిని ఊరేగిస్తున్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని పెరుమాళ్లపల్లెలో ఆదివారం మధ్యాహ్నం శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమను ఘనంగా ఊరేగించారు. ఉదయం గ్రామానికి చెందిన ప్రబోధానంద భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం కృష్ణుడి ప్రతిమను విశేషంగా అలంకరించి పల్లకిపై కొలువుదీర్చి గ్రామ పురవీధుల మీదుగా మేళతాళాలు, చిన్నారుల నృత్య ప్రదర్శనల నడుమ కోలాహలంగా ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కొబ్బరి కాయలు కొట్టి, కర్పూర నీరాజనాలు సమర్పించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ డంపింగ్‌పై కేసు నమోదు



తమిళనాడుకి తరలించేందుకు ఉంచిన ఇసుక సీజ్ చేసిన పోలీసులు

పాలసముద్రం: మండలంలోని వనదుర్గాపురం చలమరాజు ఇండ్లు గ్రామంలో అక్రమంగా ఇసుక డంపింగ్ చేసిన పాలకూరు రామ్‌ప్రసాద్‌పై ఆదివారం కేసు దర్యాప్తు చేశారని ఎస్ఐ భారతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ సీఐ హనుమంతప్ప ఆదేశాల మేరకు వనదుర్గాపురంలో అక్రమంగా ఇసుక డంపింగ్ చేసి రాత్ర సమయంలో తమిళనాడుకి తరలిస్తున్నారని రహస్య ఫిర్యాదు మేరకు వనదుర్గాపురం పంచాయతీ చలమరాజు ఇండ్లు గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను సీజ్ చేసి డంపింగ్ చేసిన పాలకూరు రామ్‌ప్రసాద్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

దివ్యాంగులకు అన్యాయం చేస్తే సహించం



సమావేశంలో మాట్లాడుతున్న మునిరత్నం

పలమనేరు: నియోజకవర్గంలోని దివ్యాంగులకు పింఛన్ల విషయంలో అన్యాయం చేస్తే సహించేది లేదని జిల్లా మానవ హక్కుల సంస్థ నిర్వాహకులు మునిరత్నం హెచ్చరించారు. స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం పింఛన్లకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వికలత్వశాతం తక్కువగా ఉందనే కారణంతో చాలామందికి పింఛన్లను కూటమి ప్రభుత్వం తొలగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై తాము సదరం సర్టిఫికెట్లను మంజూరు చేసినా అధికార యంత్రాంగం ఇలా చేస్తుండటం శోచనీయమని, దీనిపై తాము న్యాయపోరాటం చేస్తామన్నారు. సమావేశంలో సుబ్బమ్మ, హరికృష్ణ, గోవిందు, సుజాత, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ: ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాదంలో కాలు విరిగిన చంప్లా నాయక్

రామకుప్పం: మండలంలోని పీఎం తండా మలుపు వద్ద ఆదివారం రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. కావలిమడుగు చెందిన బీరప్ప(40) అటవీశాఖలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం ద్విచక్రవాహనంలో ఆయన ననియాలకు బయలుదేరాడు. అదే సమయంలో ననియాల తండాకు చెందిన చంప్లా నాయక్(57) అతని కుమారుడు దొండరామ్‌నాయక్‌తో కలసి తమ గ్రామం నుంచి ద్విచక్ర వాహనంలో పీఎంకే తండాకు వచ్చారు. పీఎం తండా మలుపు వద్ద వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. దీంతో వారిద్దరూ కింద పడిపోయారు. బీరప్పకు తలపైన తీవ్ర రక్త గాయాలయ్యాయి. చంప్లా నాయక్‌కు కాలు విరిగిపోయింది. గ్రామస్తులు వారిని గుర్తించి 108 వాహనంలో రామకుప్పం పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం కుప్పం ఆసుపత్రికి తరలించారు.

'భవిత'కు ఏదీ భరోసా?

- భవిత కేంద్రాల్లో వసతుల కరువు
- దివ్యాంగులకు అందని రవాణా చార్జీలు, అలవెన్స్‌లు
- అందని చికిత్సలు.. దివ్యాంగుల అవస్థలు
- కేంద్రాలకు ఫిజియోథెరపిస్టుల కొరత



మండల కేంద్రమైన తవణంపల్లెని భవిత కేంద్రం



పిల్లలకు విద్య బోధన సహిత విద్య ఉపాధ్యాయుడు

తవణంపల్లె/ఐరాల: శారీరకంగా, మానసికంగా బాధపడుతున్న దివ్యాంగ చిన్నారులకు భరోసా కరువైంది. దివ్యాంగులైన చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు వారిలో ఆత్మవిశ్వాసం, మనోవికాసం పెంపొందించాలనే సంకల్పంతో ప్రభుత్వం భవిత కేంద్రాలు ఏర్పాటు చేసింది. కానీ దివ్యాంగుల పిల్లలకు మౌళికవసతులు కల్పించడంలో ఈ సర్కారు పూర్తిగా విఫలమైంది. భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాల పిల్లల కోసం కనీస వసతులు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారు.

నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి

నియోజకవర్గంలో 5 భవిత కేంద్రాలు ఉన్నాయి. వాటిల్లో సుమారు 455 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఉన్నారు. భవిత కేంద్రాల్లో ప్రస్తుతం సుమారు 110 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ కేంద్రాల్లో వివిధ రకాల బోధన పరికరాలను క్యారంబోర్డును, ఆటల పరికరాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు వ్యాయామ ఉపాధ్యాయుల నేతృత్వంలో యోగా తరగతులు కూడా నిర్వహిస్తున్నారు. ఇంటికే పరిమితమైన ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రతి శనివారం ఇంటికే వెళ్లి బోధిస్తున్నారు. బుద్ధిమాంద్యం పిల్లలకు బోధించడానికి, వినికిడి లోపం(మూగ, చెవుడు) వినికిడి లోపం ఉన్న పిల్లలకు బోధించడానికి ప్రతి కేంద్రానికి ఇద్దరు సహిత విద్య ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు.

దివ్యాంగులకు అందని అలవెన్స్‌లు

నియోజకవర్గంలోని దివ్యాంగుల పిల్లలకు రవాణా భత్యం, ఎస్కార్ట్ అలవెన్స్‌లు, ఇంటి దగ్గర చదువుకునే పిల్లలకు కూడా గత ప్రభుత్వం అలవెన్స్‌లు అందజేసింది. ప్రస్తుతం దివ్యాంగుల పిల్లలకు ఎలాంటి అలవెన్స్‌లు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. అలవెన్స్‌లు ఇవ్వకపోవడం వల్ల భవిత కేంద్రాలకు వచ్చే పిల్లల సంఖ్య రోజురోజుకూ తగ్గుముఖం పడుతోంది. దీంతో స్టైఫండ్ కూడా అందడం లేదు. నియోజకవర్గంలో పలువురు దివ్యాంగుల పిల్లలకు పింఛన్లు అందకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతి భవిత కేంద్రానికి ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

ఇదీ ఉద్దేశం

ఈ కేంద్రాల్లో మానసిక దివ్యాంగులు, చెవిటి, మూగ, జన్యుపరంగా వైకల్యంతో బాధపడుతున్న పిల్లలకు ప్రత్యేకంగా శిక్షణ అందిస్తారు. ఇందుకోసం కో–ఆర్డినేటర్లతో పాటు టీచర్లు, ఫిజియోథెరపిస్ట్‌లు అందుబాటులో ఉంటారు. భవిత కేంద్రాలకు వచ్చే చిన్నారులు, విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ అందించడంతో పాటు వారికి ప్రత్యేక చికిత్స అందిస్తారు. జిల్లా వనరుల కేంద్రం ద్వారా ప్రత్యేక అవసరాల విద్యార్థులకు అవసరమయ్యే ఉపకరణాలు(యంత్ర పరికరాలు) సరఫరా చేస్తారు. అందుకోసం ప్రతి మూడు నెలకొకసారి నియోజకవర్గ స్థాయిలో మెడికల్ క్యాంప్‌లో ఏర్పాటు చేస్తారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో భవిత కేంద్రాల నిర్వహణ గాడి తప్పింది. వాటిపై సర్కారు భిన్నంగా వ్యవహరిస్తోంది. విద్యార్థుల అలవెన్స్‌లు సకాలంలో చెల్లించకపోగా, వైద్య శిబిరాలను సక్రమంగా నిర్వహించడం లేదు. దీంతో అటు భవిత కేంద్రాల సిబ్బందికి, ఇటు ప్రత్యేక అవసరాల పిల్లలు వారి తల్లిదండ్రులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని నియోజకవర్గవాసులు కోరుతున్నారు.

దివ్యాంగులకు వ్యాయామం కరువు

శారీరకంగా, మానసికంగా బాధపడుతున్న పిల్లలకోసం వ్యాయామం చేయించడానికి ఫిజియో థెరపిస్టులను నియమించారు. ఫిజియోథెరపిస్టులు నియోజకవర్గంలోని ప్రతి భవిత కేంద్రానికి ఒక్కొక్క రోజు వెళ్లి ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ(వ్యాయామం) చేయించేవారు. దీనివల్ల నడవలేని పిల్లలు, వైకల్యం కలిగిన పిల్లల్లో క్రమేణా మంచి ఫలితాలు వచ్చాయి. నడవలేని పిల్లల్లో శారీరక మార్పులు వచ్చాయి. దివ్యాంగుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రతి భవిత కేంద్రానికి ఫిజియోథెరపిస్టులను నియమించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



భవిత కేంద్రంలో యోగా చేస్తున్న విద్యార్థులు

సకాలంలో భత్యం మంజూరు చేయాలి



భవిత కేంద్రాల్లో విద్యను అభ్యసిస్తున్న దివ్యాంగుల పిల్లలకు ప్రభుత్వం అందించే రవాణా, ఎస్కార్ట్, ఇంటి దగ్గర చదువుకునే పిల్లలకు భత్యం వెంటనే చెల్లించాలి. ఈ భత్యాలు రాకపోవడం వల్ల మా పిల్లలను భవిత కేంద్రాలకు తీసుకపోవడం కష్టంగా ఉంది. భవిత కేంద్రానికి వెళ్లడానికి ఎలాంటి రవాణా సౌకర్యం లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి భత్యలను చెల్లించి ఆదుకోవాలి.

–బాలకాసి, పొన్నేదువల్లి, తవణంపల్లె

ఫిజియోథెరపీని పునరుద్ధరించాలి



భవిత కేంద్రాల్లో గత ప్రభుత్వం నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ కార్యక్రమాన్ని తిరిగి పునరుద్ధరించాలి. గతంలో భవిత కేంద్రంలో ప్రతి బుధవారం ఫిజియోథెరపిస్టులు వచ్చి మా పిల్లలకు వ్యాయామం చేయించేవారు. ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఫిజియోథెరపిస్టులు లేకపోవడంతో మా పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఫిజియోథెరపిస్టులను నియమించి మా(ప్రత్యేక అవసరాలు గల) పిల్లలకు వ్యాయామం చేయించాలి.

–అముద, దొమ్మరగుడిసెలు, తవణంపల్లె

మాకు ఉద్యోగ భద్రత కల్పించాలి



సుమారు 20 ఏళ్లుగా భవిత కేంద్రంలో సహిత విద్య ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నాను. సహిత విద్య ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. భవిత కేంద్రంలో చిన్నారులకు ప్రత్యేకంగా బోధిస్తున్నాను. భవిత కేంద్రానికి రాని పిల్లలకు ఇంటి వద్దకే వెళ్లి విద్య బుద్ధులు నేర్పుతున్నాం. ప్రత్యేక అవసరాల పిల్లలకు ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు చాలా అవసరం. ఫిజియోథెరపిస్టులు లేకపోవడం వల్ల వ్యాయామం చేయించడం లేదు.

–దేవేంద్ర, సహిత విద్య ఉపాధ్యాయుడు, తవణంపల్లె

వినికిడి యంత్రాలు సరఫరా చేయాలి



భవిత కేంద్రాల ద్వారా వినికిడి లోపం ఉన్న పిల్లలకు ఉపకరణాలు(యంత్ర పరికరాలు) అందించాల్సి ఉంది. గతంలో ప్రభుత్వం మండలంలో వినికిడి లోపం ఉన్న పిల్లలను గుర్తించి యంత్ర పరికరాలు సపఫరా చేసింది. ప్రస్తుతం వినికడి లోపం ఉన్న పిల్లలకు కూడా యంత్రాలను సరఫరా చేయాల్సి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించిన దివ్యాంగ చిన్నారులకు అవసరమైన పరికరాలు పంపిణీ చేయాల్సి ఉంది.

–ఢిల్లీ, సహిత విద్య ఉపాధ్యాయుడు, తవణంపల్లె